# కంపు కొడుతున్న కాలనీ

- పిట్లం సాయిబాబా కాలనీలో ఎక్కడ పడితే అక్కడ చెత్తపారబోస్తున్న వైనం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

పిట్లం(జుక్కల్): పిట్లం మండల కేంద్రం పరిధిలోని సాయిబాబా టెంపుల్ కాలనీ సమీపంలో ప్రధాన రహదారి పక్కన చికెన్ వ్యర్థాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్, హోటళ్లకు సంబంధించిన చెత్తాచెదారాలు పారేయడంతో కాలనీలో ఉన్న వారికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.కాలనీ పక్క గల రోడ్డుపై వేయడంతో కంపు వాసన భరించలేకపోతున్నారు. చెత్త వేస్తున్న వారికి,గ్రామ పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అదే తంతుగా చెత్తను అక్కడే వేస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. డంపింగ్ యార్డులు ఉన్నా వాటిని వినియోగించుకోవడంలేదని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తూ ప్రజలకు ఇబందులకు గురిచేస్తున్నారని అంటున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఇలా జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వంస్పందించి నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



పిట్లం సాయిబాబా ఆలయం సమీపంలో రోడ్డు పక్కన వేసిన చెత్త చెదారం





చికెన్ సెంటర్, ఫాస్ట్ ఫుడ్, హోటల్స్‌లోని చెత్తను వాహనాలపై తీసుకెళ్లి సాయిబాబా ఆలయం సమీపంలో రోడ్డు పక్కన వేస్తున్న వ్యక్తులు

## భూసమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

ఎల్లారెడ్డి రూరల్/గాంధారి/సదాశివనగర్:రైతుల భూసమస్యలు తీర్చడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్లు సూచించారు. శుక్రవారం ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రేమ్ కుమార్, గాంధారి మండలం తిమ్మాపూర్‌లో తహసీల్దార్ రేణుకా చౌహాన్, సదాశివనగర్ మండల కేంద్రంలో తహసీల్దార్ సత్యనారాయణ.. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సదస్సును సబ్‌కలెక్టర్ కిరణ్మయి సందర్శించి..దరఖాస్తులను పరిశీలించారు. పలు సూచనలు చేశారు.



సదాశివనగర్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

### ఇనుప స్తంభం మార్పు



భిక్కనూరు: మండల కేంద్రంలోని పప్పులవాడలో విద్యుత్ ఇనుప స్తంభం ప్రమాదకరంగా ఉండటంతో సాక్షిలో ఈ నెల 11న 'ఇనుప స్తంభం మార్చండి' అనే శీర్షికతో ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. ఇనుప విద్యుత్ స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో నూతన స్తంభం బిగించారు. ఏఈ సంకీర్త్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

### డి-20 కాలువ శుభ్రం



డి-20 కాలువలో గడ్డి తొలగించిన తర్వాత..

నస్రుల్లాబాద్: దుర్కి గ్రామంలో గల నిజాంసాగర్ డి-20 కాలువ ఆనవాళ్లు కరువయ్యాని సాక్షిలో ఈ నెల 14న వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఇరిగేషన్ డీఈ జగదీష్ తమ సిబ్బందితో కాలువలో మొలిచిన గడ్డిని తొలగించి చివరి వరకు నీరు పారేలా చేశారు. ప్రతి డిస్ట్రిబ్యూటరీని నిరంతరం పర్యవేక్షించి చివరి వరకు నీరు పారేలా చూడాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. డి-20 కాలువలో ఉన్న గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయడంతో శుక్రవారం రైతులు తమ పొలాలకు నీరు పారించుకోవడం మొదలు పెట్టారు.

## 'మాదక ద్రవ్యాలకు బానిస కావద్దు'





కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు, భిక్కనూరులో ..

కామారెడ్డి అర్బన్/భిక్కనూరు/గాంధారి/ఎల్లారెడ్డి/బీబీపేట/లింగంపేట:డ్రగ్స్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలని అధ్యాపకులు, ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పలు కళాశాలల విద్యార్థుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..వ్యసనాలకు బానిస కాకుండా స్వీయ నియంత్రణ ఉండాలన్నారు. కల్తీకల్లు, గంజాయి వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తే అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాలు, తండాల్లో దొంగ చాటుగా ఎవరైనా గంజాయి సాగు చేసినట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇస్తామని, గంజాయి సాగు చేయొద్దని అవగాహన కల్పిస్తామని ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.



గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో..



బీబీపేట బాలుర పాఠశాలలో..



లింగంపేటలో..

### నిర్లక్ష్యం మాటున ప్రమాదం



మొగా వద్ద రోడ్డుపై ఉన్న ఇసుక

మద్నూర్(జుక్కల్): కాంట్రాక్టర్ అలసత్వమో, అధికారుల నిర్లక్ష్యమో కాని సీసీ రోడ్డు కోసం వేసిన ఇసుక వల్ల వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు. వివరాలు.. డోంగ్లీ మండలంలోని మొగాలో సీసీ రోడ్డు కోసం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు రూ.30 లక్షల నిధులు మంజూరు చేశారు. సీసీ రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 2 నెలల క్రితం కంకర, ఇసుకను మేనూర్-డోంగ్లీ ప్రధాన రహదారిపై పోశారు. రెండు నెలలుగా పనులు ప్రారంభం కాకపోవడంతో రోడ్డుపై ఇసుక, కంకర చేరడంతో అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు నిత్యం జారి పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండ ఇసుక మొత్తం రోడ్డంతా చేరి మురికి కాలువల్లో పోతుండడంతో ప్రజాధనం వృధాగా అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

### ఉపాధ్యాయుల డిప్యుటేషన్‌లను రద్దు చేయాలి



మాట్లాడుతున్న సంఘం నాయకులు

కామారెడ్డి టౌన్: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఉపాధ్యాయుల డిప్యుటేషన్‌లను రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. కొందరు ఉపాధ్యాయులు సంఘాల పేరుతో, పలుకుబడి ఉపయోగించుకుని మేడ్చల్ ఇతర ప్రాంతాలకు డిప్యుటేషన్‌లను వేయించుకున్నారన్నారు. అవకతవకలు జరుగకుండా సర్దుబాటు ప్రక్రియ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంగయ్య, నాయకులు బాల్‌నర్సు, సత్య, వంశీకృష్ణ తదితరులున్నారు.

### కరెంటోళ్ల కష్టాలు



తెగిపడ్డ వైర్‌కు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మల్లుపేట్‌వాగులో ఈదు రుగాలులకు ఇన్సులేటర్ ఫెయిల్ కావడంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో కరంట్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గమనించిన విద్యుత్ శాఖ సిబ్బంది లైన్ ఇన్‌స్పెక్టర్ రావుసింగ్, లైన్‌మన్ గణేశ్, ఏఎల్‌ఎంలు బాబూరావు, అహ్మద్‌లు వెంటనే వాగు వద్దకు చేరుకుని మరమ్మతులు చేపట్టారు. వాగులోకి దిగి తెగిన వైర్లను అతికించడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## క్లుప్తంగా

### బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా రాంచందర్



లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లి గ్రామానికి చెందిన వడ్ల రాంచందర్‌ను బీజేపీ కామారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా నియమించినట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం ఎండ్రియాల్‌లో జరిగిన కార్యక్రమంలో రాంచందర్‌ను కౌన్సిల్ మెంబర్‌గా నియమించి ఘనంగా సన్మానించారు. గత 18 ఏళ్లుగా రాంచందర్ లింగంపేట మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకులు జిల్లా కౌన్సిల్ మెంబర్‌గా నియమించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, జిల్లా కన్వీనర్ రవీందర్, మండల అధ్యక్షుడు క్రాంతికుమార్, నాయకులు పాల్గొన్నారు.

### బీజేవైఎం మండల అధ్యక్షుడిగా సంతోష్ రెడ్డి



బీబీపేట: బీజేవైఎం మండల అధ్యక్షుడిగా మాందాపూర్ గ్రామానికి చెందిన చింతకుంట సంతోష్ రెడ్డిని ఏకగ్రీవంగా నియమిస్తూ శుక్రవారం అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సద్వినియోగం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

### సమ్మె నోటీస్ అందజేత

దోమకొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాన్ని నిరసిస్తూ జూలై 9న నిర్వహిస్తున్న జాతీయ సమ్మెలో పాల్గొంటామని టెలిఫోన్ బీడీ కంపెనీ మేనేజర్‌కు తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దరాములు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం సమ్మె నోటీస్‌ను అందజేశారు. బీడీ పరిశ్రమపై ఆంక్షలు ఎత్తివేయాలని, జీఎస్టీని తొలగించాలని, కోప్టా చట్టాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. నేతలు నగరపు ఎల్లయ్య, ప్యాకర్లు జగదీష్, టేకేదార్లు శంకర్, ప్రవీణ్, నరేష్ పాల్గొన్నారు.

### తడి, పొడి చెత్తపై అవగాహన



ఎల్లారెడ్డి: పట్టణంలోని 2వ వార్డులో తడి, పొడి చెత్తపై శుక్రవారం ఎల్లారెడ్డి మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పలు అంశాల గురించి వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిలువ ఉన్న నీటిని ప్రతి వారం రోజులకొకసారి తొలగించాలని సూచించారు. మున్సిపల్, మెప్మా సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్ తదితరులున్నారు.

### బెంచీల వితరణ



బాన్సువాడ/బాన్సువాడరూరల్: విద్యార్థులు, వారి తల్లిదండ్రుల విరాళంతో పాఠశాలకు బెంచీలను బహూకరించారు. మండలంలోని బోర్లం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు నేలపై కుర్చుంటున్నారని గమనించి విద్యార్థుల తల్లిదండ్రులు రూ.21 వేల విలువ గల 21 బెంచీలను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపి మాట్లాడుతూ.. విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి బెంచీలను విరాళంగా ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఉపాధ్యాయులు అయ్యాల సంతోష్, చైతన్య, సత్యనారాయణ, రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు విజయ్‌భాస్కర్, విఠల్, లక్ష్మి, జ్యోతి తదితరులు ఉన్నారు.

### వేతన సవరణతో కార్మికులకు ఊరట



సదాశివనగర్(ఎల్లారెడ్డి):అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులకు ఊరట లభించింది.ఫ్యాక్టరీకి చెందిన కార్మికులకు కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్(నిజామాబాద్) ఆధ్వర్యంలో వేతన సవరణ చేశారు. దీంతో 215 మంది కార్మికులకు లబ్ది చేకూరడంతో ఊరట లభించినట్లయింది. గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు, ఫైనాన్స్ మేనేజర్ మాలకొండయ్య, ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్, కార్మిక సంఘం నాయకులు నల్ల మహిపాల్ రెడ్డి, మహేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**విద్యార్థులకు బ్యాగులు, డ్రెస్సులు, పుస్తకాల పంపిణీ**

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు.పెన్నులను శుక్రవారం పంపిణీ చేశారు. అలాగే పలు ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను అందజేశారు. రామేశ్వర్‌పల్లి వీడీసీ అధ్యక్షుడు సూర్యకాంత్ రెడ్డి, నేతలు వినోద్‌గౌడ్, రాకేష్‌రెడ్డి, వల్లపు శేషి, వెంకట్‌రెడ్డి, చేపూరి రాజు, ద్యాగల కిరణ్‌లు పాల్గొన్నారు.

మద్నూర్(జుక్కల్):మద్నూర్‌లోని పోచమ్మ గల్లీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల,అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మండల కేంద్రానికి చెందిన హోంగార్డ్ బండివార్ గోవింద్ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. పది సంవత్సరాలుగా హోంగార్డ్ గోవింద్ విద్యార్థులకు నోట్‌బుక్‌లు అందించడం హర్షించదగ్గ విషయమని స్థానికులు పేర్కొన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు రాజు తన సొంత డబ్బులతో విద్యార్థులకు తెలుగు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలుగులో రాత నైపుణ్యం కోసం ఈ నోట్స్‌ను అందజేసినట్లు తెలిపారు.

**సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు..**

రామారెడ్డి: గిద్ద గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకున్న పలువురు లబ్దిదారులకు శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ గౌడ్ ఆధ్వర్యంలో చెక్కులను పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవూఫ్, బండి ప్రవీణ్, శ్రీనివాస్ రెడ్డి, నామాల రవి పాల్గొన్నారు.

**ఎర్రాపహాడ్‌లో ఉపాధి పనులపై గ్రామసభ**

తాడ్వాయి(ఎల్లారెడ్డి):ఎర్రాపహాడ్‌లో శుక్రవారం ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ కార్యక్రమంపై అధికారులు గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్అలీ, ఏపీవో కృష్ణాగౌడ్, సీఆర్పీ సాంబశివాచారి, ఫీల్డు అసిస్టెంటు బాలురాజు, తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి మన ఊరు ఫౌండేషన్ సహాయం**

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామానికి చెందిన బెస్త నర్సింలు అనే వ్యక్తి మృతి చెందగా ఆయన కుటుంబానికి తక్షణ సహాయంగా 'మన ఊరు ఫౌండేషన్' ద్వారా బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు సున్నపు సత్యనారాయణ, ప్రతినిధులు కొలిమి భీంరెడ్డి, ప్రభాకర్, రాజేందర్‌గౌడ్, జి.ప్రవీణ్, యేసుస్వామి, ఎం.రామాగౌడ్ పాల్గొన్నారు.

**దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి శిబిరం**

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఐఈఆర్‌పీ కమల్ కిషోర్ మాట్లాడుతూ..9 మంది చిన్నారులకు వైద్యులు సారిక పరీక్షలు నిర్వహించారని అన్నారు. తల్లిదండ్రులకు చిన్నారులకు ఇంటి వద్ద చేసే వ్యాయామాల గురించి వివరించారు.

**ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి వైద్య శిబిరం**

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆప్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీవ్ర దృష్టి సమస్యలు ఉన్నవారికి అద్దాలు వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, మోతె బిందు సమస్యలున్న వారు శస్త్ర చికిత్స చేసుకోవాలని తదితర సూచనలు ఇచ్చినట్లు తెలిపారు.

## నేటి చిత్రం

### ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

బాన్సువాడ : పట్టణంలోని శ్రీరామ కాలనీలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో గల శ్రీరామకాలనీలో భవనాలకు విద్యుత్ వైర్లు దగ్గరగా ఉండడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందోనని కాలనీవాసులు భయపడుతున్నారు. ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు స్పందించి వైర్లను భవనాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



శ్రీరామకాలనీలో ఇళ్లకు దగ్గరగా ఉన్న విద్యుత్ వైర్లు

–కిరణ్ కుమార్, శ్రీరామ కాలనీ, బాన్సువాడ

**మాకు ఫొటో పంపండి**

మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

కామారెడ్డి : 94942 60200
ఎల్లారెడ్డి : 97053 46576
బాన్సువాడ : 94402 11363
జుక్కల్ : 97053 46578

## బిల్లులు చెల్లించేలా ఒత్తిడి తీసుకురండి

భిక్కనూరు: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన బిల్లులురూ. 3 కోట్ల వరకు ఉన్నాయని, వెంటనే ప్రభుత్వం చెల్లించేలా ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి మధ్యాహ్న భోజన వంట కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కిష్టాగౌడ్, ప్రధాన కార్యదర్శి కూడెల్లి వెంకటేశం కోరారు. ఈ మేరకు శుక్రవారం వినతి పత్రాన్ని భిక్కనూరులో అందజేశారు. తొమ్మిది నెలలుగా గుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆరు నెలలుగా వేతనం కూడా రావడం లేదని అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదని వివరించారు. ప్రభుత్వాన్ని ఈ విషయమై నిలదీసి తమకు బిల్లులు ఇప్పించాలని వారు కోరారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న సంఘం నేతలు

## అంత్యక్రియలకు అవస్థలు

రామారెడ్డి: మేజర్ గ్రామ పంచాయతీ అయిన రామారెడ్డిలో 2011 జనాభా లెక్కల ప్రకారం 8,816 మంది ఉండగా ప్రస్తుతం ఈ జనాభా 15 వేలకు మించిపోయింది. 15 వేల జనాభాకు ఒకటే వైకుంఠధామం చింతలకుంటలో నిర్మించారు. గ్రామంలోని సగం జనాభా అంత్యక్రియలను పటేల్ చెరువు వైపు నిర్వహిస్తారు. సగం జనాభా చింతలకుంటలో నిర్వహిస్తారు. చింతలకుంట వైపు వైకుంఠధామంలో సౌకర్యాలు ఉన్నా, పటేల్ చెరువు వైపు అంత్యక్రియలు నిర్వహించడం ఇబ్బందిగా మారింది. ఎండాకాలంలో పటేల్ చెరువు చివరలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. కానీ వర్షాకాలం అయితే పటేల్ చెరువు చివర్లో 6 నుంచి 8 గజాల స్థలంలోనే అంత్యక్రియలను నిర్వహించాల్సి వస్తోంది. ఇది చాలా ఇబ్బందికరంగా మారింది. ఆచారం ప్రకారం కనీసం శవాన్ని చుట్టూ తిప్పడం కూడా సాధ్యం కావడం లేదు. మరోవైపు ఒకే రోజు ఇద్దరికీ అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తే ఒకరి అంత్యక్రియలు పూర్తయ్యే వరకు మరో శవం వేచి చూడాల్సిందే. పటేల్ చెరువు వైపు మరో వైకుంఠ ధామాన్ని నిర్మించి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఆరు గజాల స్థలంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న మృతుడి బంధువులు(ఫైల్)

### మేడిపల్లిలో ఎక్స్‌ప్రెస్ బస్సును ఆపాలని వినతి



వినతి పత్రం ఇస్తున్న పలు గ్రామాల ప్రజలు

గాంధారి(ఎల్లారెడ్డి): బాన్సువాడ-కామారెడ్డి మార్గంలో నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ బస్సులను మేడిపల్లి స్టేజీ వద్ద ఆపాలని కోరుతూ మేడిపల్లి, సీతాయిపల్లి, గంగివేట్, చందానాయక్ తండా, చెన్నాపూర్, కొండాపూర్ తదితర గ్రామాలకు చెందిన నాయకులు శుక్రవారం బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజరు సరితకు వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయం గురించి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు విజ్ఞప్తి చేయగా ఆయన డిపో మేనేజర్‌తో ఫోన్ మాట్లాడారు. డిపో మేనేజరు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

### దోస్త్ గడువు ఈనెల 25 వరకు పెంపు

ఎల్లారెడ్డిరూరల్: డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఇంటర్ పాసైన విద్యార్థులు దోస్త్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 25 వరకు గడువును పొడిగించినట్లు ఎల్లారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ అన్నారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని వినియోగించుకుని అడ్మిషన్లు పొందాలని సూచించారు.

**మాదక ద్రవ్యాల నిరోధంపై ప్రతిజ్ఞ..**

ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధానికి తోడ్పడతామని అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడవద్దని ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ అన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు శంకరయ్య, ప్రభాకర్, చంద్రకాంత్ తదితరులున్నారు.

### బీటీఎస్ వద్ద బ్రిడ్జి నిర్మించండి



వినతి పత్రం అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ తిరుమల గౌడ్

దోమకొండ: బీబీపేట–దోమకొండ వెళ్లే రోడ్డుపైన బీటీఎస్ చౌరస్తా వద్ద బ్రిడ్జిని నిర్మించాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌కు దోమకొండ మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో దిశ సమావేశానికి హాజరైన ఎంపీ సురేష్ షెట్కార్‌ను కలిసి బ్రిడ్జి లేకపోవడంతో కలుగుతున్న ఇబ్బందుల గురించి వివరించారు. మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారాం, నేతలు మధు, తాటిపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### డీసీసీబీ మహాజన సభకు తరలిన విండో చైర్మన్లు



భిక్కనూరు: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన డీసీసీబీ మహాజన సభకు భిక్కనూరు మండలంలోని అన్ని సింగిల్ విండో చైర్మన్లు శుక్రవారం తరలి వెళ్లారు. విండోల అభివృద్ధికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విండో చైర్మన్లు నల్లవెల్లి అశోక్, మద్ది స్వామి, గంగళ్ల భూమయ్య, ఎన్గు వెంకట్‌రెడ్డి, అలకొండ వెంకట్‌రెడ్డి, నాగార్తి భూంరెడ్డి, రాజగౌడ్, తదితరులున్నారు.